క్లుప్తంగా

మత్స్యకారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న భీమయ్య

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ, పెంచికల్‌పేట్ మండలం ఆగర్‌గూడ గ్రామాల్లోని మత్స్యకారులకు మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షుడు భీమయ్య మాట్లాడుతూ మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా మల్టీస్టేట్ కోఆపరేటివ్ చట్టం ద్వారా వివిధ పథకాలు తెచ్చిందన్నారు. సొసైటీలో సభ్యత్వం తీసుకున్న మత్స్యకారులు నేరుగా లబ్ధి పొందవచ్చన్నారు. మల్టీసొసైటీ కోఆపరేటివ్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య, డైరెక్టర్ సాయికుమార్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్లు దివ్య, చరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలుపొందాలని అభిమాని పూజలు



కోనేరు కోనప్ప ఫ్లెక్సీతో అభిమాని తరుణ్

సిర్పూర్(టి): ఎమ్మెల్యేగా కోనేరు కోనప్ప మరోసారి గెలుపొంది నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలందించాలని మండలంలోని హుడ్కిలికి చెందిన యువకుడు, ఆయన అభిమాని తరుణ్ ప్రముఖ ఆలయం కేదార్‌నాథ్ ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కోనేరు కోనప్ప ఫ్లెక్సీతో ఫొటో దిగారు.

పోడు రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆదివాసీ పోడు రైతులు

తిర్యాణి: ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదని ఉమ్మడి మంగి పంచాయతీ పరిధిలోని ఆదివాసీల రైతులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద గురువారం నిరసన వ్యక్తం చేసి అనంతరం మాట్లాడారు. అధికారులు కొన్ని చోట్ల జాయింట్ సర్వేలు చేపట్టకుండానే పలుకుబడి ఉన్న వాళ్లతో అధికారులు కుమ్మక్కై పట్టాలు అందించారన్నారు. అక్రమ పట్టాలు పొందిన వారిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ పోడు రైతులు కోవ లాలు, జుగ్నక లింగు, అనంతరావ్, లక్ష్మణ్, దౌలత్‌రావు, రఘు ఉన్నారు.

పీఆర్సీ కమిటీని వెంటనే అమలు చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు పెంచేందుకు వేతన సవరణ కమిటీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. పట్టణం, మండలంలోని గురుకులం పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ తొలి పీఆర్సీ గడువు జూన్ 30న ముగిసిందని, రెండో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచినా పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ కాలేదన్నారు. సమావేశంలో కార్యదర్శి మహిపాల్, నయిమ్, ఆనంద్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందిస్తున్న సీఐ


ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన సత్యనారాయణ సెల్‌ఫోన్ గత నెలలో పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక సహాయంతో పోలీసు సిబ్బంది, అధికారుల సహకారంతో కానిస్టేబుల్ రుకియాన సుల్తానా గుర్తించి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్‌కుమార్ గురువారం బాధితుడికి ఫోన్ అప్పగించారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం

తిర్యాణి: వర్షాలు కురవాలని గ్రామదేవతలకు మహిళలు గురువారం జలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని పోచమ్మ, భూలక్ష్మి, ఎల్లమ్మ ప్రతిమలపై 100 బిందెల నీటితో జలాభిషేకం నిర్వహించి మొక్కుకున్నారు.

కెరమెరి మండలంలో కలపాలి!

- కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్‌కు విన్నవించిన కొండిబాగూడ గ్రామస్తులు
- ధ్రువీకరణ పత్రాలకు, ఇతర పని నిమిత్తం జైనూర్‌కు..
- దూరభారంతో గ్రామీణులకు తిప్పలు



కొండిబాగూడ గ్రామం

కెరమెరి: రెండు వైపులా కెరమెరి మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి గ్రామాలు..మధ్యలో జైనూర్ మండలంలోని కొండిబాగూడ గ్రామం ఉంది. కెరమెరి కంటే జైనూర్ మండల కేంద్రం ఆ గ్రామానికి దూరంగా ఉండడంతో గ్రామీణులు తిప్పలు పడుతున్నారు. కార్యాలయం, వివిధ పని నిమిత్తం అక్కడికి వెళ్తున్నారు. జైనూర్‌కు రాకపోకలు సాగించాలంటే ఏళ్లుగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల కొత్త మండలాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మా గ్రామాన్ని కెరమెరి మండలంలో కలపాలని వారు కోరుతున్నారు.

120 కుటుంబాలు 700 జనాభా..

కొండిబాగూడలో 120 కుటుంబాలు 700 జనాభా ఉంది. ఈ గ్రామం జైనూర్ మండలంలోని ఆంద్‌గూడ పంచాయతీలో ఉంది. ఆ గ్రామానికి ముందు అనార్‌పల్లి, వెనుక లక్మాపూర్ గ్రామాలు కెరమెరి మండలంలో ఉన్నాయి. గత కొంతకాలంగా కొండిబాగూడకు చెందిన ప్రజలు తమ గ్రామాన్ని కెరమెరి మండలంలో కలపాలని వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొండిబాగూడ నుంచి జైనూర్ 30 కి.మీ, కెరమెరి 10 కి.మీ దూరంలో ఉంది. దీంతో అధిక దూరభారమవుతుంది. నిత్యావసర వస్తువులు, వారసంత, మార్కెటింగ్, కూలీ పనులకు కెరమెరికి వెళ్తున్నారు. కేవలం ధ్రువీకరణ పత్రాల కోసమే జైనూర్ మండలానికి వెళ్లాల్సి వస్తుంది.

ఖర్చు అధికం

కెరమెరికి వెళ్లాలంటే రూ.100, అదే జైనూర్‌కు రూ.250 ఖర్చు వస్తుంది. ఒకరోజు వెళ్తే అధికారులు దొరకకపోతే మళ్లీ వెళ్లడంతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఒకసారి అధికారిక పనికి వెళ్తే రోజంతా వృథా అవుతుంది. రోజువారి కూలీ చేసుకుని జీవించే వారికి ఇబ్బంది తప్పడం లేదు. పాఠశాలలు, ప్రభుత్వం ఆస్పత్రుల అవసరం ఏర్పడితే మీ ఊరు జైనూర్ మండలంలో ఉంది కదా! అక్కడే వెళ్లండి అంటూ అధికారులు ఈసడించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ గ్రామానికి చెందిన పలువురు ప్రజలు కలెక్టర్ హేమంత్ బోర్కడె, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మిని కలిసి సమస్యలను వివరిస్తే సానుకూలంగా స్పందించినట్లు ప్రజలు తెలుపుతున్నారు.

కెరమెరిలో కలిపితే మేలు



మా గ్రామాన్ని కెరమెరి మండలంలో కలిపితే ఎంతో మేలవుతుంది. దూరభారంలో ఇబ్బంది పడుతున్నాం. కార్యాలయ పనుల కోసం వెళ్తే సమయానికి అధికారులు రాక పదేపదే వెళ్లాల్సి రావడంతో ఖర్చు అవుతుంది. విద్య, వైద్యానికి తిప్పలు తప్పడం లేదు. – సిందే సిద్దార్థ, కొండిబాగూడ

వేడుకున్నాం



మేమంతా కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్‌ను కలిశాం. గ్రామాన్ని కెరమెరి మండలంలో కల్పించాలని వేడుకున్నాం. పడుతున్న ఇక్కట్లు, జైనూర్‌లో ఉండడం వల్ల కలిగే ఇబ్బందులు, కెరమెరిలో కలిపితే లాభాల గురించి వివరించాం. సానుకూలంగా స్పందించారు.
– గాయక్‌వాడ్, ప్రకాశ్, కొండిబాగూడ

విస్తరణ పనులతో అన్యాయం

- రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన



పాసు పుస్తకాలు చూపిస్తున్న రైతులు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ 2 గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా 133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. సబ్‌స్టేషన్ కోసం రోడ్డు విస్తరణ పనులు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గురువారం నిర్మాణం చేస్తున్న రహదారి వద్ద పాస్‌పుస్తకాలు ప్రదర్శించి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లడానికి గతంలో 12 ఫీట్ల రహదారిని నిర్మించారని తెలిపారు. కాని గత మంగళవారం నుంచి 33 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారని అన్నారు. సుమారు కిలోమీటర్ వరకు 33 ఫీట్ల రహదారి నిర్మాణం చేస్తుండడంతో ఒక్కొక్కరు అర ఎకరం భూమి కోల్పోతున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన మనోజిత్ సేన్, రేణుక దేశాయ్, ప్రభాతి గైన్, దిలీప్ పాల్, నళిని రాయ్‌లకు భూమి ఉందని, అధికారుల వద్దకు వెళ్తే స్పందించడం లేదన్నారు. పనులు అడ్డుకుంటే కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని అన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈవో సోమయ్య

కౌటాల: మన ఊరు–మనబడి ద్వారా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంఈవో డి.సోమయ్య అన్నారు. మండలంలోని పార్డీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనులను గురువారం పరిశీలించారు. పలు పనుల్లో పురోగతి లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాలన్నారు. పూర్తి చేసిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీఆర్పీ గంథం ప్రకాశ్ ఉన్నారు.

రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

కెరమెరి: రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని బారేమోడి, ఝరి(ఉర్దూ) ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. మండలంలో తొలి విడతలో 19 పాఠశాలలు మన ఊరు–మన బడి కింద ఎంపిక కాగా, రెండు బడులను ప్రారంభించగలిగామన్నారు. మిగిలినచోట్ల అసంపూర్తి పనులను పూర్తి చేయాలన్నారు.

‘ఈటల’ను కలిసి జిల్లా నాయకులు



రాజేందర్‌ను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ జిల్లా నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కొట్నాక విజయ్‌కుమార్, చెర్ల మురళి, దోని శ్రీశైలంతోపాటు పలువురు నాయకులు ఈటలను శాలువాలతో సన్మానించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన ప్రణాళికపై చర్చించారు. అనంతరం బీజేపీ జాతీయ నాయకురాలు డీకే అరుణ, వీరేందర్‌ను కలిసి పలు అంశాలపై మాట్లాడారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్: స్వర్గీయ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం 38వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని హడ్కోకాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రాం అతి చిన్న వయస్సులో అనేక పదవులు చేపట్టి, హరిత విప్లవాన్ని సృష్టించారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేశ్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట సాగర్, సంఘ నాయకులు రాజు, సాయి, బన్నీ, గణేశ్, పాషా, రాజేశ్వరి, రేణుక, భాగ్య, జయ పాల్గొన్నారు.

మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన మహిళా నాయకురాలు కుందారపు శంకరమ్మ ఇటీవల మున్నూరు కాపు మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ గురువారం ఆమెను సన్మానించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, శ్రీధర్, వినోద్ జైస్వాల్, సుదర్శన్‌గౌడ్, జహూరొద్దీన్, మురళీగౌడ్, అన్నపూర్ణ అరుణ, ఆనంద్ పాల్గొన్నారు.

డిస్మిస్డ్ కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): 1993 నుంచి 2023 వరకు వివిధ కారణాలతో విధులకు గైర్హాజరు అయి ఉద్యోగాలు కోల్పోయిన డిస్మిస్డ్ కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, రాష్ట్ర నాయకుడు పోచమల్లు అన్నారు. సింగరేణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. 1997 నుంచి వారసత్వ ఉద్యోగాల పిల్లలు ట్రైనింగ్ పూర్తి చేసిన వారందరికి షరతులు లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఓసీపీలను నిలిపివేసి కొత భూగర్భ గనులను ప్రారంభించాలని అన్నారు. డిస్మిస్డ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బినబోయిన రవీందర్, ప్రధాన కార్యదర్శి సాయిరాల దుర్గయ్య పాల్గొన్నారు.

మొరం పోయించాలి



కెరమెరి: మండలంలోని శివగూడ గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డుకు రెండు వైపులా మొరం వేయకపోవడంతో పడిపోయే ప్రమాదం ఉంది. గతేడాది ఎన్‌ఆర్‌ఈజీఎస్ భాగంగా సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు ఎత్తుగా ఉండడం, ఇల్లు కిందిభాగంలో ఉండడంతో చిన్నారులు నడుస్తున్న వేళ పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మొరం పోయించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె



పెంచికల్‌పెట్: నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



కౌటాల: వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

పెంచికల్‌పేట్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు గురువారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.19,500కు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కెరమెరి: మండలంలోని 31 పంచాయతీల కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మా డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్మికులు నరేశ్, రాందాస్, పరమేశ్వర్, క్రిష్ణ, దత్తారాం, శ్రీకాంత్ ఉన్నారు.

కౌటాల: తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు కార్యదర్శి సాయికృష్ణకు వినతిపత్రం అందించారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో పాల్గొడానికి కార్మికులకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్మికులు నానయ్య, దుర్గయ్య, రవి, తార, పార్వతి, శంకర్, సాలమ్మ పాల్గొన్నారు.

రెబ్బెన: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ బోగే ఉపేందర్, సుధాకర్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్మికులు బాబాజీ, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. జంగు, సతీశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రధాని మోదీ సభ జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: వరంగల్‌లోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ప్రధాని మోదీ వరంగల్‌కు వస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, పజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

క్రీడా ప్రవేశాలకు ఎంపిక పోటీలు

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం క్రీడా పాఠశాలల్లో 4,5వ తరగతుల ప్రవేశాల ఎంపిక పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో పోటీల్లో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికైనట్లు పీఈటీలు తెలిపారు. ఈనెల 11న జిల్లాస్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఎంఈవో సోమయ్య, హెచ్‌ఎం రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఇటీవల నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ సురేశ్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేవైఎం నాయకులు సాయి, ఫన్నీ, మోతె శ్రీధర్, నాగేశ్, అశోక్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

వాంకిడి: మండలంలోని అర్జుగూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు హెల్పింగ్ ఫౌండేషన్ సహకారంతో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ఫౌండర్ సుశీల్, కోఆర్డినేటర్లు విశ్వనాథ్ ఆనంద్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని సబ్‌సెంటర్ పరిధిలోని మానిక్‌పటార్ గ్రామంలోని విద్యార్థులకు గురువారం సికిల్‌సెల్, అనీమియా పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

దహెగాం: మండల కేంద్రంతోపాటు కుంచవెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదర్శ గ్రూప్ వినయ్ ఆటో టెక్ ప్రైవేటు లిమిటెడ్ మహీంద్రా ట్రాక్టర్ షోరూం ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. బ్రాంచ్ మేనేజర్ శివ, ప్రతినిధులు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని ఎల్లారం రైతులకు ఏవో ఖాదర్ హుస్సేన్‌తో కలిపి ఎంపీపీ మల్లికార్జున్ సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సీతారాం, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌రూరల్: కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన రైతులకు రైతుబంధు, రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో రామకృష్ణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ గతనెల జూన్ 18 వరకు కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన వారు, పోడు పట్టాలు వచ్చిన రైతులు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 10 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, తగిన వివరాలతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

చెట్లతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న ఎంపీటీసీ, నాయకులు

బెజ్జూర్: చెట్లతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన అన్నారు. హరిత హారంలో భాగంగా గురువారం బెజ్జూర్ నుంచి పాపన్నపేటకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, బీఆర్‌ఎస్ నాయకుడు జావిద్, మాలి సంఘం యువ నాయకులు కావిడి వెంకటేశ్, చటారి శంకర్, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం పక్కన మహాత్మా జ్యోతిబా పూలే వి గ్రహం ఏర్పాటు చేయాలని మాలి సంఘం జి ల్లా అధ్యక్షుడు నాగోశ శంకర్ డిమాండ్ చేశా రు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం, మాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండు సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ అంబేద్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రహదారి విస్తరణలో భాగంగా ఆదిలా బాద్ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న పూలే విగ్రహాన్ని తొలగించారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, నా యకులు ఆదె బాపూరావు, శెండె సోమేశ్వర్, వైరాగడే మారుతి, గుర్నులె మారుతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంటను పరిశీలిస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఎల్లారం, అంకుసాపూర్ ప్రభుత్వ పాఠశాలలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సర్పంచ్ సీతారం ఉన్నారు.

మెడికల్ కాలేజీలో కార్మికుల పిల్లలకు సీట్లు

రెబ్బెన: రామగుండం మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు ఐదు శాతం సీట్లు కేటాయించటం అభినందనీయమని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. గోలేటిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు 5శాతం సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నీట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా కార్మికుల పిల్లలకు కేటాయించిన సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలో కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని అసెంబ్లీలో కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, టీబీజీకేఎస్ విజ్ఞప్తి మేరకు ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో కార్మికుల పిల్లలకు రిజర్వేషన్ కల్పించారన్నారు.